RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ బుధవారం 07.01.2026 సంపుటి : 03 సంచిక : 37 పేజీలు : 08 వెల: రూ.5

Karimnagar Wednesday 07.01.2026 Volume: 03 Issue 37 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## గ్రామ సభలను నామమాత్రం చేయకండి



7

# పారదర్శకంగా హిల్ట్

## పారిశ్రామిక ప్రగతికన్నా ప్రజల ప్రాణాలే ముఖ్యం

**సుప్రీంకోర్టు తీర్పు ప్రాతిపదికన హిల్ట్**

**హిల్ట్‌పాలసీలో రాజకీయాలు పక్కన పెట్టాలి**

**ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించ వద్దా?**

**ఇప్పటికైనా మేల్కోకపోతే.. హైదరాబాద్‌కు ఢిల్లీ పరిస్థితి**

**మంత్రి శ్రీధర్ బాబు**

2

పారిశ్రామిక ప్రగతి కంటే.. ప్రజల ప్రాణాలే ముఖ్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రాతిపదికన హిల్ట్‌పాలసీ తీసుకువచ్చామన్నారు. మంగళవారం అసెంబ్లీలో హిల్ట్‌పాలసీపై లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఈ హిల్ట్‌పాలసీ విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలంటూ ప్రతిపక్షలకు సూచించారు.



## కేసీఆర్ చెప్పు ధూళికి సరితూగడు రేవంత్‌రెడ్డి..

**సీఎంపై కేటీఆర్ ఫైర్**

2



# సోనియాగాంధీకి అస్వస్థత

**ఢిల్లీ కాలుష్య ప్రభావమే కారణమన్న వైద్యులు**

**న్యూఢిల్లీ, జనవరి 6:** కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో సోమవారం రాత్రి ఢిల్లీలోని గంగారామ్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, చికిత్సకు స్పందిస్తున్నారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. 79ఏళ్ల సోనియాకు దీర్ఘకాలిక దగ్గు సమస్య ఉండడంతో పాటు ఢిల్లీలో ఉన్న వాయు కాలుష్య పరిస్థితుల నేపథ్యంలో తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇప్పుడు చలి తీవ్రత కూడా తోడవడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఒక్కసారిగా తిరగబెట్టాయని వైద్యులు తెలిపారు.



ప్రస్తుతం ఆమె ఛాతీ వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్నారని, ఆందోళన అవసరంలేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

# కరూర్ తొక్కిసలాట కేసు..

**టీవీకే చీఫ్ విజయ్‌కి సీబీఐ సమన్లు**

కరూర్ తొక్కిసలాట కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో నిందితుడిగా ఉన్న తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్‌కి సీబీఐ సమన్లు జారీచేసింది. ఈ నెల 12న తమ ముందు విచారణకు హాజరు కావాలని నోటీసులలో ఆదేశించింది. దేశ రాజధాని ఢిల్లీలోని సీబీఐ హెడ్ క్వార్టర్స్‌లో విజయ్‌ని విచారించనున్నట్లు తెలిపింది.కాగా గత ఏడాది సెప్టెంబర్ 27న తమిళ నాడులోని కరూర్ పట్టణంలో విజయ్ ప్రచార ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 110 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఈ ఘటనకు కారణం ఏమిటి..? బాధ్యులు ఎవరు అనే విషయాన్ని సీబీఐ నిర్ధారించాలని తన ఆదేశాల్లో పేర్కొన్నది.అదేవిధంగా సీబీఐ దర్యాప్తును పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యుల కమిటీని కూడా నియమించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి నేతృత్వంలో ఈ కమి



టీని వేసింది. ఘటనపై నిష్పక్షపాత దర్యాప్తు జరిగేలా చూడాలని టీవీకే పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో.. సుప్రీంకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడంతో పాటు, ముగ్గురు సభ్యుల కమిటీని నియమించింది.

# కనుమ రోజు సెలవు

**సంక్రాంతి సెలవులపై క్లారిటీ..**

**హైదరాబాద్, జనవరి6 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి సంబంధించి సంక్రాంతి సెలవులను ప్రకటించింది. జనవరి 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అన్ని పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ సెల



వులు ప్రభుత్వ, ప్రైవేటు, వాణిజ్య పాఠశాలలకు వర్తిస్తాయని పేర్కొంది.జనవరి 16వ తేదీన కనుమ రోజును పురస్కరించుకుని ఐచ్ఛిక సెలవు కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కనుమ రోజున రైతులు తమ పండుగను ప్రత్యేకంగా చేసు కుంటారు. కనుమ రోజున ఉత్సవాలు, పండుగ సంబ రాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జనవరి 17వ తేదీ నుంచి అన్ని పాఠ శాలలు తిరిగి ప్రారంభమవుతాయని స్పష్టం చేసింది.

జనోదయ



# పారదర్శకంగా హిల్ట్

## పారిశ్రామిక ప్రగతికన్నా ప్రజల ప్రాణాలే ముఖ్యం



**సుప్రీంకోర్టు తీర్పు ప్రాతిపదికన హిల్ట్**

**హిల్ట్‌పాలసీలో రాజకీయాలు పక్కన పెట్టాలి**

**ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించ వద్దా?**

**ఇప్పటికైనా మేల్కోకపోతే.. హైదరాబాద్‌కు ఢిల్లీ పరిస్థితి**

**మంత్రి శ్రీధర్ బాబు**

పారిశ్రామిక ప్రగతి కంటే.. ప్రజల ప్రాణాలే ముఖ్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రాతిపదికన హిల్ట్‌పాలసీ తీసుకువచ్చామన్నారు. మంగళవారం అసెంబ్లీలో హిల్ట్‌పాలసీపై లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఈ హిల్ట్‌పాలసీ విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలంటూ ప్రతిపక్షలకు సూచించారు.

**హైదరాబాద్, జనవరి 06:** పారిశ్రామిక ప్రగతి కంటే.. ప్రజల ప్రాణాలే ముఖ్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రాతిపదికన హిల్ట్‌పాలసీ తీసుకువచ్చామన్నారు. మంగళవారం అసెంబ్లీలో హిల్ట్‌పాలసీపై లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఈ హిల్ట్‌పాలసీ విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలంటూ ప్రతిపక్షలకు సూచించారు. హిల్ట్‌పాలసీలో ఏదో మతలబ్ ఉందని ఆరోపణలు చేశారని తెలిపారు. కొండను తవ్వతూనే ఉన్నారని.. ఎంత తవ్వుతారో తాము చూస్తామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై కావాలనే ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారంటూ ప్రతిపక్షలపై మండిపడ్డారు. స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వలేని నాగరికత.. అసమర్థ నాగరికతే అవుతుందని అభివర్ణించారు. అభివృద్ధి పేరిట పర్యావరణ విధ్వంసం జరుగుతోందని ఆయన హెచ్చరించారు. అభివృద్ధి అంటే ప్రకృతిని నాశనం చేయడం కాదన్నారు. పిల్లలకు ఆస్తులు కాదు.. శుభ్రమైన వాతావరణం ఇవ్వడమే నిజమైన వారసత్వమని ఈ సందర్భంగా మంత్రి డి.శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. ఇంకా చెప్పాలంటే బంగారు గిన్నెలో విషం పెట్టినట్లవుతోంది మన పరిస్థితంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి నాశనమైతే తిరిగి రాదని మంత్రి హెచ్చరించారు. మనమంతా భూమి యజమానులు కాదని.. కేవలం ట్రస్టీలమేనన్నారు. భవిష్యత్తు తరాలకు క్లీన్ ఎన్విరాన్ మెంట్ ఇవ్వడం మన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ఢిల్లీలో నివాసాల మధ్యనున్న 168 పరిశ్రమలను.. తరలించాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. చైనాలో బ్లూ స్కై విధానం ద్వారా.. భారీ పరిశ్రమలను నగరం అవతలికి తరలించారని వివరించారు. కాలుష్య కారక పరిశ్రమలు ఓఆర్ఆర్ లోపల ఉండకూడదనే హిల్ట్‌పాలసీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. పారదర్శకంగా ముందుకెళ్లేలా హిల్ట్ పాలసీ అమలు చేస్తామన్నారు. ప్రజలకు స్వచ్ఛ మైన గాలి, నీరు అందించ వద్దా? అంటూ ప్రతిపక్షలను మంత్రి శ్రీధర్‌బాబు సూటిగా ప్రశ్నించారు. 2013లోనే రెడ్ అండ్ ఆరెంజ్ పరిశ్రమలను.. ఓఆర్ఆర్ అవతలికి తరలించాలని జీఓ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజల భవిష్యత్ దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలన్నారు. ప్రజలను కాలుష్యం నుంచి రక్షించాలనే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. హిల్ట్‌పాలసీ బయటకు రాక ముందే విమర్శిస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములు అడ్డగోలుగా ఇస్తున్నారని మాట్లాడుతున్నారని.. అయితే కనీస సమాచారం తెలియ కుండా బీఆర్ఎస్, బీజేపీలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ హిల్ట్‌పాలసీపై సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తామన్నారు. ఈ పాలసీపై కింద 6 నెలల గడువు ఇస్తామని పేర్కొన్నారు.స్వచ్ఛందంగా ముందుకొస్తేనే భూములు కన్వర్ట్ చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తల భూములు.. ప్రభుత్వానివి అంటూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దశాబ్దాల కిందటే గత ప్రభుత్వాలు వారికి భూములు అమ్మేశాయని గుర్తు చేశారు. మనం భూ యజమానులం కాదని.. ట్రస్టీలం మాత్రమేనని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ల్యాండ్ కన్వర్షన్‌పై బలవంతం ఏమీలేదన్నారు. పారిశ్రామికవేత్తలకు ఇష్టమైతేనే ల్యాండ్ కన్వర్షన్ చేస్తామని తెలిపారు. గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయంటూ ప్రతిపక్షలపై విరుచుకు పడ్డారు. ఇప్పటికైనా పర్యావరణ విధ్వంసం ఆగాలన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు అపార్ట్‌మెంట్స్ పక్కనే ఉన్నాయని.. పరిశ్రమలు, రెసిడెన్షియల్ ప్రాంతాల మధ్య బఫర్ జోన్లు లేవన్నారు. బఫర్ జోన్లు లేకపోవడం వల్లే.. గతంలో విశాఖ పట్నంలో ఎల్జీ పాలిమర్స్, మధ్యప్రదేశ్ లోని భోపాల్‌లో గ్యాస్ వంటి దుర్ఘటనలు చోటు చేసుకున్నాయని వివరించారు. పారిశ్రామిక రసాయనాల వల్లే భూగర్భ జలాలు విషపూరితం అవుతాయన్నారు.మేల్కోకపోతే హైదరాబాద్ కూడా..ఢిల్లీ పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

# కేసీఆర్ చెప్పు ధూళికి సరితూగడు రేవంత్‌రెడ్డి..

**జనగామ :** సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చెప్పు ధూళికి కూడా సరితూగడని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం జనగామలో బీఆర్ఎస్ తరఫున గెలిచిన సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన .. సీఎం రేవంత్‌రెడ్డిపైన, కాంగ్రెస్ ప్రభుత్వం పైన విమర్శల వర్షం గుప్పించారు. తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసఆర్ అని, అందుకే ఆయన తన తండ్రి అని గర్వంగా చెప్పుకుంటానని కేటీఆర్ అన్నారు. అలాంటి మొనగాడిని సవాలు చేస్తున్న రేవంత్ రెడ్డి అనేటోడు ఆయన చెప్పు ధూళికి కూడా సరిపోడని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్ పెడితేనే రేవంత్ రెడ్డి ఆగమాగం అయితున్నడని, ఆయన అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే అక్కడే గుండె ఆగి సస్తడని అన్నారు.రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధిద్దామని ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలన్న ఆలోచనతోనే ఓటు వేసి ఆయనను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన ప్రతి ఒక్క సర్పంచి మున్సిపల్ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని కోరారు.వరంగల్ జిల్లాలో సర్పంచులు పెద్ద సంఖ్యలో గెలిచారని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడ్డా, ఒత్తిళ్లకు గురిచేసినా పార్టీ కోసం నిలబడ్డారని ప్రశంసించారు. బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి ధన్యవాదాలు చెప్పారు. జనగామ ర్యాలీ చూస్తే 'కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు' అనిపించిందని అన్నారు.ప్రజలు గులాబీ జెండాను చూడగానే చప్పట్లు కొడుతుంటే సంతోషం అనిపించిందని, కాళోజీ మాటలు గుర్తొచ్చాయని అన్నారు. కేసీఆర్ ఎప్పుడు ముఖ్యమంత్రి అయితారా అని ప్రజలు కసితో ఎదురుచూస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ఏ పాత్ర లేకున్నా అన్ని పదవులు ఇచ్చిన పార్టీని వదిలి కడియం శ్రీహరి సీఎం రేవంత్ రెడ్డితో కలిశాడని విమర్శించారు.ఇక్కడి నిబద్ధత కలిగిన కార్యకర్తలు బీఆర్ఎస్ బలపర్చిన 150 మంది సర్పం చులను గెలిపించారని మెచ్చుకున్నారు. చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, రాణి రుద్రమదేవి పుట్టిన గడ్డ ఇదని కీర్తించారు.



# కారోబార్‌లపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

**ఎంపీడీవోకు వినతి**



**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 6:** ఇటీవల ఎన్నికల్లో గెలిచిన కొందరు సర్పంచ్‌లు తమపై వ్యక్తి గత కక్షలకు పాలుపడుతున్నారని బెల్లంపల్లి మండల కారోబార్ ( బిల్ కలెక్టర్ )ల సంఘం నాయకులు మంగళవారం బెల్లంపల్లి ఎంపీడీవో. మహేందర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో చాలీ, చాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ నిత్యం ప్రజలకు సేవ చేస్తున్న తమను కొందరు కొత్తగా గెలిచిన సర్పంచ్‌లు కక్ష సాధింపులకు చేస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. సర్పంచుల చర్యల వల్ల తాము తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మేము వ్యక్తిగతంగా ఎవరికి పని చేయమని, ప్రభుత్వ నిబంధనలకు మేరకు గ్రామ కార్యదర్శి, సర్పంచ్ ల ఆదేశాలకు కట్టుబడి పని చేస్తామని చెప్పారు. కొందరు సర్పంచ్‌లు కావాలని కక్షగట్టి వేధిస్తున్నారని తెలిపారు. సర్పంచ్ లకంటే కొందరు ఉప సర్పంచులు సర్పంచ్ లను డామినేట్ చేస్తూ ఆధిపత్యం చలాయిస్తున్నారని ఆవేదన చెందారు.సర్పంచ్‌లను తప్పుదోవ పట్టిస్తూ వ్యక్తి గత కక్ష లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పని భారానికి, తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. సర్పంచుల, ఉపసర్పంచుల చర్యలను కారోబార్ ల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. వారి వ్యవహారం ఇలాగే కొనసాగితే జిల్లా స్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళలు చేస్తామని హెచ్చరించారు.కలెక్టర్ , డిపిఓలను కలిసి తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తామని పేర్కొన్నారు.

# విద్యుత్ అధికారుల ప్రజా బాట




**జనోదయ, భీమారం, జనవరి 06** విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల ప్రకారం విద్యుత్ శాఖ ఏ.ఈ బి.అశోక్ మన్నెగూడెం వారు భీమారం మండల కేంద్రంలో గ్రామ రైతులు,విద్యుత్ వినియోగదారుల తో విద్యుత్ ప్రజా బాట నిర్వహించారు,ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ భద్రతల గూర్చి, ప్రభుత్వం అందిస్తున్న 200యూనిట్లు ఉచిత విద్యుత్తు గృహ జ్యోతి పథకం మరియు సోలార్ రూఫ్ టాప్ పతకం గూర్చి వివరించారు..అలాగే ఎటువంటి సమస్యలు ఉన్న తెలియజేయాలని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు టోల్ ఫ్రీ 1912 సదుపాయాన్ని వాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ ఏ.హరిప్రసాద్, అసిస్టెంట్ లైన్ మెన్ సురేష్ , భీమారం సర్పంచ్ చెక్కపెల్లి స్వాతి-సంజీవ్, ఉపసర్పంచ్ పరమేశ్వర్, ప్రజా ప్రతినిధులు చెక్కపల్లి రఘు,పల్లి అర్జున్ రైతులు సురేష్, విశ్వంభర్,రంజిత్ రెడ్డి,శేకర్ రెడ్డి, రాజేష్,వినోద్,గంగారాజం,రాజశేఖర్ పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 6:** బెల్లంపల్లి పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఎస్సై సిహెచ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఎస్సై కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రైల్వే స్టేషన్ ప్రాంతంలో సర్కిల్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మాల గురిజాల గ్రామానికి చెందిన కోనూరు రామకృష్ణ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించినట్లు చెప్పారు. అతడిని సోది చేయగా 36 గ్రాముల ఎండు గంజాయి ప్యాకెట్ ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మహారాష్ట్రలోని బల్లార్షా రైల్వే స్టేషన్ వద్ద తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి బెల్లంపల్లిలో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. అతని వద్ద నుండి గంజాయి ప్యాకెట్ తో పాటు సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. యువత గంజాయి మత్తులో పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఎవరైనా గంజాయి కొనుగోలు చేసినా, విక్రయించిన పోలీసులకు తెలపాలని చెప్పారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మాదకద్రవ్యాల రైతు సమాజం కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



# టీజీపీఏ జిల్లా అధ్యక్షులుగా సదానందం



**జనోదయ, మందమర్రి జనవరి 6:** తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా మంతెన సదానందం ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణంలోని సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంచిర్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేల్పుల చిరంజీవి, ఉపాధ్యక్షులుగా పులిపాక శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా గద్దం మహేష్, కోశాధికారిగా వేల్పుల చిన్న చిరంజీవిలు ఎన్నిక కాగా వీరికి టిజిపిఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పులేటి నరేష్ నియామక పత్రాలు అందచేసి మాట్లాడారు. జిల్లాలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాలలో చదివే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్య, సౌకర్యాల కల్పన కోసం వీరు కృషి చేస్తారన్నారు.

# నోడల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**



**జనోదయ,జగిత్యాల జిల్లా ప్రతినిధి** జగిత్యాల జిల్లాలోని 5 మున్సిపల్ పరిధిలో ఎన్నికల నిర్వహణ కొరకు భాగంగా నోడల్ అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ తో కలిసి రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ నిర్వహించారు.జిల్లాలోని 5 మున్సిపాలిటీల పరిధిలోని ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా, ముసాయిదా ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే జనవరి 10వ తేదీ లోపు వ్రాతపూర్వకంగా తెలపాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల,మెట్పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపల్ ఎన్నికల్లో నోడల్ అధికారులకు కేటాయించిన ఆయా విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.పోలింగ్ కేంద్రాలు మరియు నామినేషన్ కేంద్రాలు మున్సిపాలిటీ వారిగా ఎన్ని ఏర్పాటు చేయాలి మరియు ఎక్కడ ఏర్పాటు చేయాలి అనేది ప్రణాళిక చేసుకోవాలి.ప్రతి పోలింగ్ స్టేషన్‌ను మరియు నామినేషన్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్లు ప్రత్యక్షంగా సందర్శించాలి. పోలింగ్ సిబ్బంది మరియు ఆర్వో ల నియామకం, శిక్షణ అందించడం డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ సెంటర్‌ల ఏర్పాటు, కౌంటింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ స్టేషన్ ల వద్ద మౌళిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల కోడ్ అమలు, ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాల ఏర్పాటు చేయాలని తెలిపారు. 5 మున్సిపాలిటీలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు ఆయా మున్సిపాలిటీలను సందర్శించి ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్లతో చర్చించి, తగు సూచనలు అందించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.అలాగే ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసి ఎన్నికలను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, జిల్లా నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



# విద్యా శాఖలో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావాలి

**జిల్లా కలెక్టర్ కోయ హర్ష**

**జనోదయ,పెద్దపల్లి ప్రతినిధి,జనవరి 6:**

పెద్దపల్లి జిల్లాలో విద్యాశాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి కావాలని కోయ హర్ష స్పష్టం చేశారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో విద్యాశాఖలో కొనసాగుతున్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా మంజూరైన పనులు ఆలస్యం కాకుండా పూర్తి చేయాలని, ముఖ్యంగా జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధి, యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం, జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల భవన పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షం చాలని ఆదేశించారు. గోదావరిఖని లో రూ. 10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శాతవాహన యూనివర్సిటీ అడ్మిన్ బ్లాక్‌ను రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తిచేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు, భూముల బదలాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని



అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పనతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. విద్యా మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగు పడాలని కలెక్టర్ ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయాలి

**పెద్దపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షులు కర్ర సంజీవరెడ్డి**

**జనోదయ,పెద్దపల్లి/8వ కాలనీ,జనవరి 6:**

మంగళవారం 8వ కాలనీలోని బి.ఎం.ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఆకుల శశి అధ్వర్యంలో రామగుండం కార్పొరేషన్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్ర సంజీవరెడ్డి పాల్గొన్నారు. రామగుండం కార్పొరేషన్ 8వ కాలనీ పరిధిలోని 7 డివిజన్ నాయకులతో సన్నాహక సమావేశంలో సంజీవరెడ్డి మాట్లాడుతూ, రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అజేయమైన శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాల్లో గెలుపే అంతిమ లక్ష్యమని, సుపరిపాలన, ప్రజలు మెచ్చే పాలన అందించడమే బీజేపీ ప్రధాన



ఉద్దేశమని అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ అభ్యర్థుల విజయానికి గెలుపుకోసం కార్యకర్తలు పనిచేయాలన్నారు. అందరూ కలిసి కట్టుగా పనిచేస్తే తప్పకుండా విజయం సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మూకిరి రాజు, ఆకుల కుమార్ గౌడ్, మారేపెల్లి శ్రీనివాస్, ఎస్ పాషా, ఐలవేని అనిల్ కుమార్, పోట్ల వెంకటి, బద్రి దేవేందర్, లింగం నాయక్, కందుల నరహరి, అంకం కుమార్, మండ సాయి ప్రణీత్, రామంచ శ్రవణ్ , విక్కీ, దావా రాజిరెడ్డి, పోట్ల శశాంక్ , కొండే సాగర్, చొప్పరి లక్ష్మణ్ , దూడపాక కుమార్, మీనుగు మనోహర, గండి వసంత లక్ష్మ, పూసల రాజయ్య, సారంగ పాణి, వేణు గోపాల్ రావు, అఖిల్ గౌడ్, మండ సాయి ప్రణీత్, చెట్టిపాలెం నాగేందర్, జిమ్ నరేష్, ముత్యాల బాలయ్య, దావా రాజిరెడ్డి, కోటి, రామంచ సాగర్, రమేష్ గౌడ్, కాశి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలి

**-విహెచ్పిఎస్ జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ -**



**జనోదయ, మందమర్రి జనవరి 6:**

దివ్యాంగుల చట్టం 2016 ను పకడ్బందీగా అమలు చేసి వికలాంగులను దూషించిన, వారిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ కోరారు. మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను కలిసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల 2016 చట్టం ప్రకారం పోలీస్, న్యాయ, ఇతర శాఖల నుండి ప్రత్యేక రక్షణ సదుపాయాలు ఎస్సీ ఎస్టీ చట్టం మాదిరిగా దివ్యాంగులకు వర్తింప చేయాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో దివ్యాంగుల సౌకర్యార్థం వీల్ చైర్స్, ర్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో దివ్యాంగుల చట్టంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్ జిల్లా కన్వీనర్ బి వి అప్పారావు, నాయకులు ఇందూరి రమేష్, కంచర్ల సదానందం, దురిశెట్టి లక్ష్మణ్, మాడావి షేక్ రావులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజాబాట


**-ఎఈ ప్రభాకర్ -**

**జనోదయ, మందమర్రి జనవరి 6**

మండలంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమం చేపట్టడం జరిగిందని విద్యుత్ శాఖ మండల ఎఈ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆదిల్ పేట గ్రామపంచాయతీలో ప్రజా బాట కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయ




న మాట్లాడారు. గ్రామస్తులు విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కార మే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా వంగిన స్తంభాలు, పాత వైర్ల మార్పిడి వంటి ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నెందుగురి పున్నం, ఎస్ఎల్ఐ శ్రీనివాస్, ఎల్ఐ దామోదర్ రాజు, లైన్‌మెన్ శంకర్, ఉప సర్పంచ్ రాజన్న, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంక్రాంతి సంబరాలు

### ఆకట్టుకున్న ముగ్గుల పోటీ నిర్వహణ

**కరీంనగర్, జనోదయ జనవరి6:**

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మంగళవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీ కార్యక్రమం ఉత్సాహ భరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా చొప్పరి జయశ్రీ (ఎక్స్ కార్పొరేటర్) హాజరై పాల్గొన్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్లు వీరస్వామి, ఆదర్శ్, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీకాంత్, నవీన్, చంద్రశేఖర్, ట్రైనర్ వెంకటేష్ వర్మ, ఆపరేషన్ మేనేజర్ మహేందర్, మేనేజింగ్ పార్ట్‌నర్.జి. నరేందర్ రావు గారితో పాటు లీడర్లు, అడ్వైజర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంక్రాంతి సంప్రదాయాలు, సాంస్కృతిక విలువలను ప్రోత్సహించే విధంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సంస్థలో ఐక్యత, టీమ్ స్పిరిట్ మరింత బలపడిందని నిర్వాహకులు తెలిపారు.








# యువకుడి ప్రాణాలు కాపాడిన టచ్ ఆసుపత్రి

**జనోదయ:మంచిర్యాల జిల్లా ప్రతినిధి**

మంచిర్యాలలోని టచ్ హాస్పిటల్‌లో అరుదైన హృదయ చికిత్సతో ఓ యువకుడి ప్రాణాలు కాపాడారు. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం గొల్లగట్టు గ్రామానికి చెందిన వెంకటేష్ (23)కు తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చేరిన వెంటనే నిర్వహించిన పరీక్షల్లో అతనికి భారీ గుండెపోటు (మాసివ్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్) వచ్చినట్లు వైద్యులు గుర్తించారు. రోగి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో కార్డియాలజిస్ట్ డా. రాజేష్ భోర్కుందే తక్షణమే యాంజియోగ్రఫీ చేయించారు. ఈ పరీక్షల్లో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన ధమని పూర్తిగా (100 శాతం) మూసుకుపోయినట్లు వెల్లడైంది. ఆలస్యం చేస్తే గుండె కండరాలకు శాశ్వత నష్టం వాటిల్లే ప్రమాదం ఉండటంతో, డా. రాజేష్ భోర్కుందే నేతృత్వంలోని వైద్య బృందం అత్యవసరంగా శస్త్రచికిత్స చేసి ధమనిని విజయవంతంగా తెరిచారు. చికిత్స అనంతరం యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స అందించడంతో కుటుంబానికి ఆర్థిక భారం తప్పింది. ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి రావాలని వైద్యులు సూచించారు. జన్మభూమి నగర్‌లోని టచ్ హాస్పిటల్ అత్యవసర హృదయ చికిత్సలో మరోసారి తన నైపుణ్యాన్ని చాటుకుందని స్థానికులు ప్రశంసించారు.



# నిరుద్యోగులకు వెంటనే ఓసీపీ5లో ఉపాధి కల్పించాలి

### ముస్త్యాల సర్పంచ్ సుంకరి మహేందర్



**జనోదయ, గోదావరిఖని జనవరి. 6**

పెద్దపెల్లి జిల్లా రామగిరి మండలం సింగరేణి ప్రభావితమైన ముస్త్యాల గ్రామానికి దగ్గరలో ఉన్న పీసీ పటేల్ కంపెనీలో నిరుద్యోగులకు వెంటనే ఉపాధి కల్పించాలని పి.సి పటేల్ కంపెనీ యాజమాన్యంకు వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఓసీపీ5 ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన ఎంతోమంది నిరుద్యోగులకు వెంటనే ఉపాధి కల్పించాలని ఆయనే డిమాండ్ చేశారు. వెంటనే పిసీ పటేల్ కంపెనీ యాజమాన్యం గౌరీ భాయ్, పెద్దపెల్లి రవిలు స్పందించి త్వరలోనే వారికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాసినేని వినోద వార్డు సభ్యులు నీలం శ్రీనివాస్, గోసిక విజయ, సుందిళ్ల శారద, డేగ సందీప్, గోశిక రాజ నర్సు, సుందిల్ల కనకతార, గుమ్మడి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులు నాణ్యమైన బొగ్గు అందించేలా బాధ్యత తీసుకోవాలి

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 6:**

సింగరేణి ఉద్యోగులు వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించడంలో బాధ్యత తీసుకోవాలని కాసిపేట 1 ఇంక్లైన్ మేనేజర్ డి .సతీష్ అన్నారు. మంగళవారం బొగ్గు గని పై ఉద్యోగులతో మాట్లాడారు. ప్రపంచీకరణ నేపథ్యంలో పోటీ తత్వాన్ని ఎదుర్కొని వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించాల్సిన అవసరం ఉందన్నారు. భూగర్భ గనిలో బొగ్గులు వెలికి తీసే క్రమంలో సేలు, మట్టి లాంటివి వేరు చేయాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి, నాణ్యత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని ఉత్పత్తి సాధించాలని కోరారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి ఎంత ముఖ్యమో నాణ్యత కూడా అంతే ముఖ్యమని గుర్తించాలన్నారు. ఉత్పత్తితోపాటు రక్షణ విషయంలోనూ కార్మికులు, ఉద్యోగులు జాగ్రత్తలు వహించాలని కోరారు. ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని, కేవలం మూడు నెలల సమయం మాత్రమే ఉన్నందున ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి నిఖిల్, అందరు మేనేజర్ హిమాలయ, బన్నా లక్ష్మణ్ దాస్, మురళి, యాదయ్య, రంజిత్ పాల్గొన్నారు.



# నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్



**జనోదయ :హత్నూర :** సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరమని స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మరెడ్డి అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రుల చుట్టూ తిరిగి నష్టపోయిన బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అందించే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు కొంత బాసటగా నిలుస్తాయని ఆమె అన్నారు. అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ...హత్నూర మండలం, సికింద్లాపూర్ , గ్రామానికి చెందిన వారికి మంజూరైన రూ1,60,500.ఒక్కలక్ష అరువై వేయల ఐదువందాల రూపాయల చెక్కును లబ్ధిదారునీ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాయిని వీరేందర్, గోపాల్ రెడ్డి, విర్రప్రసాద్, వెంకటేష్, కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వైద్య సేవలు విస్తృతం చేయాలి



## పొన్నారం సర్పంచ్ మధు

జనోదయ, మందమర్రి జనవరి 6



గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలను అందుబాటు లోకి తీసుకువచ్చి ఆరోగ్యాన్ని పెంపొందించాలని పొన్నారం సర్పంచ్ పెంచాల మధు కోరారు. ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొన్నారం గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వైద్యాధికారులు రమేష్, మానసలతో కలిసి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తూ సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దేలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వైద్య శిబిరాల ఏర్పాటుకు తనవంతు సహకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం వైద్యాధికారులు రమేష్ మానసలు మాట్లాడారు. రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలన్నారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ కోసం తెమడ పరీక్షలు ఉచితంగా జరుపుతున్నామన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స అందిస్తూ, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి నెల 1000 చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని వారు తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న వారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందన్నారు. సత్వరమే వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స ప్రారంభించడం ద్వారా వ్యాధిని పూర్తిగా అరికట్టవచ్చన్నారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారికి, పొగాకు నమిలే వారికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో అవసరం ఉన్న వారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అంతే కాకుండా ఎక్స్ రే అవసరం ఉన్నవారికి వైద్య శిబిరంలో పోర్టబుల్ ఎక్స్ రే ద్వారా ఎక్స్ రే తీశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీడీవో ఎన్ రాజేశ్వర్ సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్, ఆదిల్ పేట సర్పంచ్‌లు సెగ్గం వెంకటేష్, నెండుగురి పున్నం, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డి నేటర్ సురేందర్, సిఎస్ఒ రాజేష్, ఎంఎల్హెచ్పి విష్ణు, శరత్, సూపర్ వైజర్స్ విజయ, కుమార్, టెక్నీషియన్ అజయ్, శ్రీకాంత్, ఏఎన్ఎంలు గ్లోరి , నిర్మలా, కవిత ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ సమక్షంలో
# కాంగ్రెస్‌లో చేరిక



జనోదయ : జైపూర్

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పౌనూర్ గ్రామానికి చెందిన వేముల సుధ తిరుపతి గౌడ్ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచి మంగళవారం హైదరాబాదులో మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్ల సత్యనారాయణ రెడ్డి ,శివ్వరం సర్పంచ్ అంజన్ గౌడ్ వంతెన జాక్కయ్య ఉప సర్పంచ్ బాలకృష్ణ మంతెన శేఖర్ , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి వివేక్ పెద్దపెల్లి ఎంపీ వంశీకృష్ణ అండదండ్రులతో గ్రామ అభివృద్ధిలో గాని పేదవారికి అందవలసిన ఆసరా పెన్షన్ విషయంలో గాని మరి ఏ ఇతర సంక్షమ పథకాలు అయిన పేదవారికి అందించడమే మా కర్తవ్యం అని తెలియజేశారు.

## రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని
# మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతా
## ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జనోదయ,రామగుండం జనవరి 6:

రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని సంపూర్ణ వైద్య కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో శాసనసభలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ గళమెత్తారు. కోల్‌బెల్ట్‌గా పేరు గాంచిన ఈ ప్రాంతంలో మూడు లక్షలకు పైగా జనాభా నివసిస్తుండగా, వారికి సరిపడా వైద్య సదుపాయాలు లేకపోవడం తీవ్ర ఆందోళనకరమని ఆయన అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ప్రజల అవసరాలను తీర్చలేకపోతోందని, రూ.140 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న కొత్త ప్రభుత్వ ఆసుపత్రిని ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు నిలిచిపోకుండా వెంటనే చర్యలు తీసుకుంటే, ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రోజుకు రెండు వేల వరకు అవుట్‌పేషెంట్లు వస్తున్న ఈ ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని ఆయన సూచించారు. అలాగే రూ.20 కోట్లతో నిర్మించిన క్యాథ్ ల్యాబ్‌ను తక్షణమే ప్రారంభించాలని కోరుతూ, అధిక కాలుష్యంతో గుండె సంబంధిత వ్యాధులు ఎక్కువవుతున్న నేపథ్యంలో ఆధునిక వైద్య పరికరాల అవసరం ఎంతైనా ఉందని వివరించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులను ప్రత్యేకంగా కోరినట్లు తెలిపారు. సింగరేణి, ఎన్టీపీసీ సంస్థల సిఎస్ఆర్ నిధులతో ఇప్పటికే ఆసుపత్రి అభివృద్ధి జరుగుతోందని, గతంలో సింగరేణి నిధులతో నిర్మించిన మెడికల్ కాలేజీకి మరిన్ని సదుపాయాలు కల్పించాలని ఆయన అభ్యర్థించారు. రామగుండాన్ని ఒక మెడికల్ హబ్‌గా మార్చి, కార్మికులకు, ప్రజలకు పూర్తిస్థాయి వైద్యం అందించాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



## వెంకటాపూర్ సర్పంచ్ వెంకటేష్

జనోదయ, మందమర్రి జనవరి 6:

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని వెంకటాపూర్ సర్పంచ్ సెగ్గం వెంకటేష్, కోరారు. మంగళవారం గ్రామ పంచాయతీ పరిధిలోని గుడిపల్లి యుపిఎస్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలున్నాయని, నాణ్యమైన ఉచిత విద్య, మధ్యాహ్న భోజనంతో పాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్ అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి వాటిని బలోపేతం చేయాలని కోరారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాఠశాలలో క్రీడ మైదానం అస్తవ్యస్తంగా ఉందని, పాఠశాల మెయిన్ గేట్ ముందు భారీ గుంతలు పడి ప్రమాదకరంగా మారిందని సర్పంచ్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన గుంతలను పూడ్చడంతో పాటు క్రీడా మైదానాన్ని చదును చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొండ్రు ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే సరిత, ఉపాధ్యాయులు ఎం రమేష్, ఉప సర్పంచ్ సిద్దుల రాజేశ్వరి, వార్డు సభ్యులు కాసిపేట అశోక్, మాసు సంతోష్, వేల్పుల మహేశ్వరి - సాగర్ పాల్గొన్నారు.

# గ్రామ సభలను నామమాత్రం చేయకండి

**గ్రామ స్వరాజ్యంలో** అందరూ భాగస్వామ్యం కావాలి. మాటలతో,రాతలతో గ్రామ స్వరాజ్యం సఫలం కాదు.అందుకు పాలకులైన ఎమ్మెల్యేల,ఎంపీల,ఎమ్మెల్సీలు, ప్రభుత్వ యంత్రాంగం భాగస్వాములు కావాలి.ఈ ప్రతిపాదన కొందరికి నవ్వు తెప్పించవచ్చు. ఇదేందయ్యా ప్రతి పక్ష నాయకుడే అసెంబ్లీ చర్చలకు పోకుండా రూ. 57,84,124 ల జీతం తీసుకుంటుండగా ఎమ్మెల్యేలను గ్రామ సభలకు రమ్మంటున్నారని ప్రశ్నలు ఉత్పన్నం కావడం సహజం.కానీ అది నిజం కాదు. ప్రజా ప్రతినిధులు,అధికారులు,ఉద్యోగులు ప్రజల సమస్యలు వినాలి.పరిష్కరించాలి. ఎందుకంటే? భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 (బి)73వ, రాజ్యాంగ సవరణ చట్టం 1992 ప్రకారం పంచాయతీ రాజ్ చట్టంను, నిర్దిష్ట నిబంధనలను రూపొందించుకునే అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చింది.గ్రామ సభలకు రాజ్యాంగ హోదాను ఇచ్చింది. ప్రజలను/ఓటర్లను ఎట్లాగూ అసెంబ్లీ,పార్లమెంటుకు వచ్చి సమస్యలను చెప్పుకునే అవకాశం ఇవ్వరు.కనీసం ప్రజలందరూ పాల్గొనే అవకాశం ఉన్న "గ్రామ సభలకు"మీరు కూడా పాల్గొని మా కష్ట, నష్టాలను వినాలని ప్రజలు కోరుకోవడం ప్రజాస్వామిక ఆకాంక్ష అవుతుంది.గ్రామ పంచాయతీకి ఎన్నికైన పాలక మండలి అధికారిక సమయం అయిదు సంవత్సరాలు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం ఆర్థిక సంవత్సరానికి నాలుగు గ్రామ సభల చొప్పున కేవలం 20 గ్రామ సభలు జరిగే అవకాశం ఉంది.ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్,జులై, అక్టోబర్,జనవరి నెలల్లో జరుగుతాయి.ఇంకా గ్రామ ఓటర్లలో 10 శాతం మంది లేదా 50 మంది గ్రామ సభ జరుపాలని కోరినప్పుడు కూడా ప్రత్యేక గ్రామ సభ నిర్వహించే అవకాశం ఉంది.ఏప్రిల్‌లో నిర్వహించే గ్రామ సభలో గడిచిన సంవత్సరం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు,వార్షిక ఆదాయాలు, ఖర్చులు, ప్రస్తుత సంవత్సరం నిర్వహించనున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుంది. జూలైలో నిర్వహించే గ్రామ సభలో ప్రజల అభివృద్ధి సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక,చేపట్టనున్న ప్రజా ఉపయోగ పనుల నిర్వహణకై భౌతిక,ఆర్థిక నివేదికలను సమర్పించడం జరుగుతుంది. అక్టోబర్‌లో నిర్వహించే గ్రామ సభలో చేపట్టిన ప్రజా ఉపయోగ, సంక్షేమ పథకాల భౌతిక,ఆర్థిక ప్రగతి నివేదికలను ప్రకటించడం జరుగుతుంది. జనవరిలో నిర్వహించే గ్రామ సభలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని, కార్యక్రమాల ఫలితాలను, ప్రభావాలను మదింపు చేసుకోవడం జరుగుతుంది.సామాన్యంగా ప్రభుత్వ లబ్ధిదారుల ఎంపికలో,వర్తింపచేయడంలో అధికార పక్షానికి పెద్ద పీట వేస్తున్నారని పలు ఆరోపణలను చూస్తున్నాం.నిజంగా కూడా అంగబలం,రాజకీయ బలం ఉన్న వారే ప్రభుత్వ పథకాలను పొందుతున్నారు. అర్హులైన లబ్ధిదారులు నష్టపోతున్నారు.ఇక గ్రామాలలో రెవిన్యూ సమస్యలు అధికంగా ఉత్పన్నం అవుతున్నాయి. భూవివాదాలు, సరి హద్దు గెట్టు సమస్యలు, రహదారి,వ్యవసాయ బావుల తవ్వకాలు,చిన్న నీటి వనరులైన చెరువు, కుంటల పరిరక్షణ,భూసర్వే,భూసార పరీక్షలు,విత్తనాలు,సేంద్రీయ,పచ్చిరొట్ట విత్తనాలు,రసాయనిక ఎరువులు,సహకార సంఘాల రుణాలు, పాడి పరిశ్రమ పశువుల పెంపకం,వ్యవసాయ పంటల తూకంలో తరుగు మోసాలు,వ్యవసాయ భూములకు రహదారుల అసౌకర్యం, మిషన్ భగీరథ నీటి సరఫరాలో లోపాలు,కోతుల బెడదతో ఆరుతడి పంటల సాగు కుంటు పడటం,నీటి ప్రాజెక్టు కాలువలలో పిచ్చి జంగల్ వలన చివరి ఆయకట్టు పంట పొలాలకు నీటి కొరత ఇలా అనేక సమస్యలతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ స్వరాజ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పాత్ర కీలకమైనది.అందులో జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్,అదనపు కలెక్టర్, రెవిన్యూ అధికారి, విద్యాధికారి, వ్యవసాయ అధికారి, గ్రామీణాభివృద్ధి అధికారి, పంచాయతీ అధికారి,హార్టీ కల్చర్, సెరీ కల్చర్ అధికారి,మార్కెటింగ్ అధికారి,పౌర సరఫరాల అధికారి, వైద్య ఆరోగ్య అధికారి,సహకార అధికారి,గ్రామీణ ఉపాధి కల్పన అధికారి,రూరల్ ఎంప్లాయిమెంట్ అధికారి,అటవీ శాఖ అధికారి,పశుపోషణ అధికారి, వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, జిల్లా పంచాయతీ రాజ్,మండల పంచాయతీ రాజ్ అభివృద్ధి అధికారులు,మండల రెవెన్యూ,వ్యవసాయ నీటి పారుదల,వైద్య,విద్య,నీటి పారుదల,సివిల్ ఇంజనీర్ లు, అధికారులు,నాయబ్ తహశీల్దార్ రెవిన్యూ పరిశీలకుడు,సర్వేయర్, మొదలగు ప్రభుత్వ సిబ్బంది గ్రామ సమస్యల పరిష్కారంలో, అభివృద్ధి కార్యక్రమాల సక్రమ నిర్వహణలలో, ప్రభుత్వ పథకాల అమలులో,రైతుల పంటల రక్షణలో,పంటల దిగుబడులలో ఎదురవుతున్న అవరోధాలను నమోదు చేసుకుని పరిష్కరించడానికి అవకాశాలు ఉన్నవి.ఇక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జిల్లా,మండల పరిషత్ అధ్యక్షులు ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకోవడానికి,నియోజకవర్గం ప్రజలకు ప్రాతినిధ్యం




వహించడానికి,ప్రభుత్వ పాలనను పర్యవేక్షించడానికి,చట్టాల రూపకల్పనకు,ప్రభుత్వ పథకాలను, చట్టాలను ప్రజలకు అవగాహనను కల్పించడానికి చట్ట సభల ప్రతినిధుల కృషికి గ్రామ సభలు తోడ్పడుతాయి.ఇప్పటికే సామాజిక, రాజకీయ సమీకరణలను పోగు చేసుకోవడానికి,ఆదరాభిమానులను పొందడానికి బారసాల, పెండ్లి,బోనాల జాతర, రంజాన్, క్రిస్మస్,అయ్యప్ప, ఆం జనేయ భక్తుల ప్రదర్శన మొదలగు ధార్మిక, ఆధ్యాత్మిక శుభ కార్యాలకు, విచారకరమైన అంత్యక్రియలకు, సంతాపాలకు హాజరై మంచి తనాన్ని చాటుకుంటున్నారు.అలాగే గ్రామ సభలకు కూడా ప్రభుత్వ యంత్రాంగం,చట్ట సభల ప్రతి నిధులు పాల్గొనాలి.దానితో ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో గ్రామ సభలు విజయవంతంగా జరుగుతాయి.గ్రామ స్వరాజ్య స్వప్నం సాకారమవుతుంది. 2026 జనవరి 2న దుద్దెనపల్లి గ్రామ పంచాయతీ సభ సర్పంచ్ ఉడిగె విజయ అధ్యక్షతన జరిగింది.నూతనంగా ఎన్నికైన పాలక మండలి,గ్రామ ప్రజలు పాల్గొన్న గ్రామ సభలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై ,ప్రజా సమస్యలపై చర్చ జరిగింది.గ్రామ కార్యదర్శి రావుల శ్రీనివాస్ వెల్లడించిన నివేదికలో "గ్రామ పంచాయతీ నూతన భవనం,గ్రామ మహిళల పొదుపు సంఘాల నూతన భవన నిర్మాణంకై ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయించినట్లుగా తెలిపాడు.వర్క్ కమిటీ చైర్మన్‌గా సర్పంచ్,పాలక మండలి నిర్ణయంపై త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టనున్నామని తెలిపాడు.ఇక గ్రామ సభలో పాల్గొన్న ప్రజలు సమస్యలను ఏకరవు పెట్టారు.పడాల చెరువు మత్తడి నీళ్ల ప్రవాహంతో "గండి పడిన,కోతకు గురైన ముదువాగుల మొగిలిపాలెం మట్టి రోడ్‌ను పాలక మండలి సందర్శించి,సమస్య తీవ్రతను కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర రోడ్ రవాణా, బీసీ సంక్షమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ల దృష్టికి తీసుకుపోయి నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు.కోతుల బెడద వలన ఆరు తడి, కూర గాయ పంటలు పూర్తిగా సాగు చేయడం బంద్ చేశామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో రేకుల, గూన పెంకుల ఇండ్ల పైకప్పులను పెకిలించడం వలన రిపేర్లతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు నివేదించారు. పంట పొలాల రహదారులపై ప్రయాణించుచున్నప్పుడు దాడి చేస్తున్నందున కోతుల బెడదను నివారించాలని విన్నవించారు.ఊర కుక్కలకు సంక్రమించిన వింత వ్యాధులు గాలి ద్వారా మనుషులకు కూడా సోకే ప్రమాదం ఉన్నందున కుక్కల బెడదను నియంత్రించాలని కోరారు.మిషన్ భగీరథ నీళ్లను ప్రజలు తాగునీరుగా క్యాన్‌లలో తెచ్చుకోవడానికి ట్యాప్‌లను ఏర్పాటు చేయాలని కోరారు.రిపేర్‌లో ఉన్న చేతి బోర్ పంపులను వినియోగంలోకి తేవాలని తెలిపారు. గ్రామంలో నిర్మించిన బిటి/సిమెంటు రోడ్ల నిర్మాణాల చివరన ర్యాంప్ లను నిర్మించి వాహనాల రాకపోకలకు సౌకర్యం కల్పించాలని తెలిపారు.గ్రామ సభలో ప్రజలు నివేదించిన సమస్యలు గ్రామ పంచాయతీ పరిధిలో పరిష్కారం అయ్యే అవకాశాలుఉంటున్నవి.. కానీ మండల,జిల్లా, రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాల పరిధిలో పరిష్కరించే ప్రజా సమస్యలకు గ్రామ సభలు జవాబుదారీ వహించడం లేదు.అందు గురించి అన్ని విభాగాల ప్రభుత్వ నిర్వహణ అధికారులు ,ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు కూడా "గ్రామ సభలలో పాల్గొని సమన్వయ కార్యాచరణతో సమస్యలను పరిష్కరించితే గ్రామ స్వరాజ్యం లక్ష్యం సాకారమవుతుందని ప్రజలు కోరుతున్నారు.

**గ్రామ సభలో ప్రజలు నివే దించిన సమస్యలు గ్రామ పంచా యతీ పరిధిలో పరిష్కారం అయ్యే అవకాశాలు ఉంటున్నవి.. కానీ మండల,జిల్లా, రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాల పరిధిలో పరిష్కరించే ప్రజా సమ స్యలకు గ్రామ సభలు జవాబుదారీ వహించడం లేదు.అందు గురించి అన్ని విభాగాల ప్రభుత్వ నిర్వహణ అధికారులు ,ఎమ్మెల్యే, ఎంపీ, ఎ మ్మెల్సీలు కూడా "గ్రామ సభలలో పాల్గొని సమన్వయ కార్యాచరణతో సమస్యలను పరిష్కరించితే గ్రామ స్వరాజ్యం లక్ష్యం సాకారమవుతుంది**



మేరుగు రాజయ్య
సెల్ : 9441440791